జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..
https://tholivelugu.com/
హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 121 10-5-2026 వెల: రూ.2/- పేజీలు: 06

విలేకరులు కావలెను
తొలివెలుగు జాతీయ దిన పత్రిక మన భాష.. మన పత్రిక..
www.epaper.tholivelugu.com
Contacts
తెలంగాణ
94911 34365
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో
తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.

# సిగ్నల్ ఫ్రీ సిటీగా హైదరాబాద్

**అండర్‌పాస్‌లు, ఉపరితల రోడ్లు, ఎలివేటెడ్ కారిడార్‌లు నిర్మిస్తాం**

**ట్రాఫిక్ నియంత్రణకు రహదారుల విస్తరణ ఒక్కటే సరిపోదు..**

**పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

**మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు విప్లవాత్మక నిర్ణయమని కమిటీ కితాబు**

హైదరాబాద్: హైదరాబాద్‌ను సిగ్నల్ ఫ్రీ నగరంగా మార్చాలన్న లక్ష్యంతో తమ ప్రభుత్వం ముందుకెళ్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. ట్రాఫిక్ నియంత్రణకు కేవలం రహదారుల విస్తరణ ఒక్కటే సరిపోదని, బహుళ విధానాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపరచాల్సి ఉంటుందన్నారు. పెరుగుతున్న నగరీకరణతో సమీప భవిష్యత్తులో మరిన్ని సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని, అందుకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. శనివారం సచివాలయంలో గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో రేవంత్ పాల్గొన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ(క్యూర్) ప్రాంతం మొత్తంగా ఎదురవుతున్న సమస్యలను పరిష్కరిస్తూ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్‌ను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయడానికి కృతనిశ్చయంతో ఉన్నట్లు వెల్లడించారు.





## గుంటనక్క కమీషన్లు మింగేసింది..

**బీఆర్ఎస్‌పై కవిత తీవ్ర ఆరోపణలు**

**ప్రాజెక్టుల పేరుతో బీఆర్ఎస్ కమీషన్లు దండుకుందన్న కవిత**

**రూ.33 వేల కోట్లు ఖర్చు చేసి ఒక్క ఎకరాకు నీళ్లివ్వలేదని ఆరోపణ**

**రేవంత్ ప్రభుత్వం కూడా బిల్లులు చెల్లించి కమీషన్లు తీసుకుందన్న టీఆర్ఎస్ చీఫ్**

**అధికారంలోకి వస్తే 10 లక్షల ఎకరాలకు నీళ్లిస్తామని హామీ**

## బెంగాల్ సీఎంగా సువేందు ప్రమాణం

**ప్రమాణం చేస్తున్న సువేందు**

**కోల్‌కతాలో అట్టహాసంగా ప్రమాణ స్వీకారోత్సవం**

**ప్రధాని మోదీసహా బీజేపీ అగ్రనేతల హాజరు**

**వేదిక ప్రాంగణంలో ఝాల్‌మురీ స్టాళ్లు**

కోల్‌కతా: పోరాటాల గడ్డ పశ్చిమబెంగాల్‌లో కమలనాథుల పరిపాలనా శకానికి నాందిపలుకుతూ ప్రధాని మోదీ సమక్షంలో రాష్ట్ర అగ్రనేత సువేందు అధికారి శనివారం ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. తద్వారా రాష్ట్రంలో ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన తొలి బీజేపీ నాయకునిగా సువేందు చరిత్ర సృష్టించారు. ప్రధాని, కేంద్ర మంత్రులు, పలువురు బీజేపీ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఎన్‌డీఏ కూటమి పార్టీల అగ్రనేతల



2లో

## నేడే తమిళనాడు సీఎంగా జోసెఫ్ విజయ్ ప్రమాణం

**ఉదయం 10 గంటలకు నెహ్రూ స్టేడియంలో సంరంభం**

**వీసీకే, ఐయూఎంఎల్, లెఫ్ట్ పార్టీల మద్దతుతో మేజిక్ ఫిగర్ దాటిన టీవీకే**

**చివరకు గవర్నర్ గ్రీన్‌సిగ్నల్.. ఈ మేరకు లోక్‌భవన్ అధికారిక ప్రకటన**

**సంబరాల్లో టీవీకే శ్రేణులు.. సస్పెన్స్ థ్రిల్లర్‌కి శుభం కార్డు**



2లో

చెన్నై: తమిళనాడులో నూతన ప్రభుత్వ ఏర్పాటులో నెలకొన్న సందిగ్ధ నిశ్శబ్ద వాతావరణంలో విజయ్ విజిల్ ఎట్టకేలకు గట్టిగా మోగింది. ఐదు రోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరదించుతూ ఐదు పార్టీలు అందించిన మద్దతుతో చివరకు విజయ్ సారథ్యంలోని టీవీకే పార్టీ తొలిసారిగా తమిళనాడులో



## బండి సంజయ్ కుమారుడిపై పోక్సో కేసు

**హనీ ట్రాప్ అంటున్న బండి భగీరథ్**

**మైనర్ను వేధించాడంటూ ఎదురు ఫిర్యాదు**

**ప్రధాని పర్యటన వేళ ట్విస్ట్**

కరీంనగర్: కేంద్రమంత్రి బండి సంజయ్ తనయుడిపై హైదరాబాద్‌లోని పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని సుచిత్ర ప్రాంతంలో ఉండే ఓ మైనర్ బాలిక (17) పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి ఇబ్బందులకు గురి చేశారని ఆరోపిస్తూ

2లో



## ‘నేను కాదు మనం’ అనే స్ఫూర్తితో పనిచేయాలి

**ముగిసిన 7వ జిల్లా కలెక్టర్ల సమావేశం చంద్రబాబు కీలక ప్రసంగం**

**25 ప్రాధాన్యతా ప్రాజెక్టుల పూర్తికి ఇరిగేషన్ క్యాలెండర్ విడుదల**

**అందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు సంతృప్త స్థాయిలో ఇవ్వాలని ఆదేశం**

**23 నెలల్లో రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించామన్న సీఎం**



పరిపాలనలో ప్రజలే కేంద్రంగా పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించాలని, ‘నేను కాదు, మనం’ అనే సామూహిక స్ఫూర్తితో ప్రతి ఒక్క అధికారి పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. అమరావతిలో రెండు రోజుల పాటు జరిగిన 7వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్ శుక్రవారం

## నేడే మోదీ సభ

**సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న కిషన్‌రెడ్డి, రాంచందర్‌రావు**

**సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రధాని సభకు ఏర్పాట్లు పూర్తి**

**రూ. 9,400 కోట్ల విలువైన పలు ప్రాజెక్టుల ప్రారంభం, శంకుస్థాపనలు**

**జన సమీకరణలో బీజేపీ రాష్ట్ర నాయకత్వం తలమునకలు**



హైదరాబాద్: ప్రధాని మోదీ ఆదివారం తెలంగాణ పర్యటనకు రానున్నారు. మూడోసారి ప్రధాని అయిన రెండేళ్ల తర్వాత తొలిసారి రాష్ట్రానికి రానున్నందున మోదీ పర్యటనకు రాజకీయ ప్రాధాన్యం ఏర్పడింది. ఈ పర్యటనలో

2లో

## 50 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా విశాఖ అభివృద్ధి

**రాంబిల్లి నుంచి భోగాపురం వరకు 102 కి.మీ మేర రింగు రోడ్డు**

**వీఎంఆర్డీఏ మాస్టర్‌ప్లాన్‌పై మంత్రి నారాయణ సమీక్ష**



జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..


# నేడే మోదీ సభ

(మొదటి పేజీ తరువాయి)

భాగంగా ప్రధాని తొలుత గచ్చిబౌలిలోని హెచ్ఐసీసీ నుంచి రూ. 9,400 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను వర్చువల్‌గా ప్రారంభించడంతోపాటు మరి కొన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేయనున్నారు. అనంతరం సాయంత్రం 6:30 గంటలకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న బీజేపీ బహిరంగ సభలో ఆ పార్టీ కార్యకర్తలు, ప్రజలను ఉద్దేశించి మోదీ ప్రసంగించనున్నారు. ఈ సభకు భారీ సమీకరణ ద్వారా సత్తా చాటేందుకు బీజేపీ రాష్ట్ర నాయకత్వం సర్వశక్తులు ఒడ్డి సన్నాహాల్లో తలమునకలైంది. అంచనాలకు మించి జనసమీకరణ, ప్రజలు, కార్యకర్తల హాజరు ద్వారా మోదీ సభను విజయవంతం చేసి సత్తా చాటాలనే పట్టుదలతో పార్టీ శ్రేణులున్నాయి. పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లుకు ప్రతిపక్షాలు అడ్డుకోవడంతో నియోజకవర్గాల పునర్విభజన బిల్లును కేంద్రం ఉపసంహరించుకోవడం, ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో మూడింటిని (ఒకటి మిత్రపక్షంతో కలిసి) బీజేపీ కైవసం చేసుకున్న నేపథ్యంలో పార్టీపరంగా రాజకీయ అంశాలపై మోదీ ఏం మాట్లాడతారనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# గుంటనక్క కమీషన్లు మింగేసింది..

(మొదటి పేజీ తరువాయి)

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజలను మోసం చేశాయని, కమీషన్ల కోసం ప్రాజెక్టును బలిపెట్టాయని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రంగారెడ్డి జిల్లా జిల్లేడ్-చౌదరిగూడలో శుక్రవారం నిర్వహించిన 'పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు సాధన సభ'లో ఆమె మాట్లాడారు. ఆంధ్రోళ్లను తిట్టి ఓట్లు దండుకున్న బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రాజెక్టుల పేరుతో దోపిడీకి పాల్పడిందని విమర్శించారు. "ప్రాజెక్టు కోసం రూ.33 వేల కోట్లు ఖర్చు చేసినా కనీసం 33 ఎకరాలకు కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం నీరు అందించలేకపోయింది. ఓ గుంటనక్క కమీషన్ల కోసం కాంట్రాక్టర్లతో కుమ్మక్కై ప్రాజెక్టు డిజైన్ మార్చింది. జూరాల నుంచి శ్రీశైలానికి సోర్స్ పాయింట్ మార్చడం క్షమించరాని నేరం" అని కవిత మండిపడ్డారు. ఈ మార్పు వల్లనే ఆంధ్రప్రదేశ్‌తో వివాదాలు తలెత్తుతున్నాయని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపైనా కవిత విమర్శలు గుప్పించారు. 'నల్లమల పులి బిడ్డ'నని చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి ప్రాజెక్టు పనుల్లో తట్టెడు మట్టి కూడా ఎత్తిపోయలేదని ఎద్దేవా చేశారు. కానీ, ప్రాజెక్టు పేరుతో రూ.6 వేల కోట్ల బిల్లులు చెల్లించి కమీషన్లు తీసుకున్నారని, ఇందులో కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు కూడా వాటా ఉందని సంచలన ఆరోపణలు చేశారు. దసరాలోపు పనులు ప్రారంభించకపోతే పాదయాత్ర చేసి కాంగ్రెస్‌ను ఎండగడతామని హెచ్చరించారు. తాము అధికారంలోకి వస్తే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు కింద 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని కవిత హామీ ఇచ్చారు. నీటి పారుదలపై వాటర్ కమిషన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించేలా ప్రధాని మోదీపై ఒత్తిడి తీసుకురావాలని ఆమె పిలుపునిచ్చారు.

# 50 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా విశాఖ అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

విశాఖపట్నం: రానున్న 50 ఏళ్లలో విశాఖ నగర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని సెమీ రింగురోడ్డు నిర్మిస్తున్నామని ఏపీ మంత్రి నారాయణ అన్నారు. రాంబిల్లి నుంచి భోగాపురం వరకు 102 కి.మీ మేర రింగు రోడ్డు నిర్మాణం చేపడతామని చెప్పారు. వీఎంఆర్డీఏ మాస్టర్‌ప్లాన్‌పై మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి అధికారులతో నారాయణ సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. నగరం అభివృద్ధి చెందాలంటే మాస్టర్ ప్లాన్ అవసరం. దీనిపై ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించాం. మాస్టర్‌ప్లాన్ అంశంలో వచ్చిన వినతులపై ఈ సమావేశంలో చర్చించాం. ఎమ్మెల్యేల నుంచి అందిన వినతుల్లో 90 శాతం పరిష్కరించాం. 6,836 చదరపు కి.మీ పరిధిలో వీఎంఆర్డీఏ విస్తరించి ఉంది. ఈనెల చివరి నాటికి సెమీ రింగురోడ్డు డీపీఆర్ సిద్ధమవుతుంది. భోగాపురం ఎయిర్‌పోర్టుకు ఏడు కనెక్టింగ్ రోడ్లను వీఎంఆర్డీఏ నిర్మిస్తోంది. ఇప్పటికే మూడు పూర్తయ్యాయి. భోగాపురం ఎయిర్‌పోర్టుకు బీచ్ కారిడార్ ప్రతిపాదన ఉంది. రూ.14వేల కోట్లతో తాగునీటి ప్రాజెక్టు వస్తోంది. ఇది పూర్తయితే 95 శాతం ఇళ్లకు తాగునీరు అందుతుందని మంత్రి నారాయణ వివరించారు. మాస్టర్ ప్లాన్ మేరకు విశాఖ పట్టాణాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని పురపాలక శాఖ మంత్రి నారాయణ అన్నారు. ఈ సందర్భంగా మాస్టర్ ప్లాన్‌పై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. నగరం అభివృద్ధి చెందాలంటే మాస్టర్ ప్లాన్ అవసరమని ఆయన తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించామమని మంత్రి వెల్లడించారు. 'నగరం అభివృద్ధి చెందాలి అంటే మాస్టర్ ప్లాన్ అవసరం. 6,836 చదరపు కి.మీ పరిధిలో వీఎంఆర్డీఏ ఉంది. 4,387.36 చదరపు కిలోమీటర్ల పరిధిలో మాస్టర్ ప్లాన్ సిద్ధమైంది. మిగిలిన ప్రాంతంలో రానున్న అక్టోబర్ నెలకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తాం. వీఎంఆర్డీఏ మాస్టర్ ప్లాన్‌పై వచ్చిన వినతులపై సమీక్షలో చర్చ జరిపాం. ఎమ్మెల్యేలు తీసుకువచ్చిన వినతులు 90 శాతం పైగా పరిష్కారం చూపాం. 2021లో రూపొందించిన మాస్టర్ ఎ÷-లాన్‌ను రీవిజిట్ చేయాలని ప్రజా ప్రతినిధులు సీఎంను కోరారు. దీనిపై భారీ ఎత్తున అభ్యంతరాలు వచ్చాయి. తొలుత 3720 అభ్యంతరాలు రాగా రెండవసారి 1236 అభ్యంతరాలు వచ్చాయి. సమీక్షకు హాజరుకాని ఎమ్మెల్యేలతో చర్చించి మాస్టర్ ప్లాన్ ప్రకటిస్తాం' అని మంత్రి నారాయణ తెలిపారు. హైదరాబాద్ తరహాలో విశాఖలో సెమి రింగ్ రోడ్డు నిర్మించాలని సీఎం చంద్రబాబు ప్రతిపాదించారు. రాంబిల్లి నుంచి భోగాపురం వరకు 102 కి.మీ మేర సెమి రింగ్ రోడ్డు నిర్మాణం. ఈనెల చివరికి సెమి రింగ్ రోడ్డు డీపీఆర్ సిద్ధం అవుతుంది. అలానే భోగాపురం విమానాశ్రయంకు బీచ్ కారిడార్ ప్రతిపాదన ఉంది. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో ఎస్టీపీలు ఏర్పాటు చేస్తున్నాం. ప్రాపర్టీ టాక్స్ విషయంలో పాత విధానాన్ని కొనసాగిస్తున్నాం' అని మంత్రి నారాయణ వెల్లడించారు.

# 'నేను కాదు మనం' అనే స్ఫూర్తితో పనిచేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ముగిసింది. సుమారు 22 గంటల పాటు సాగిన ఈ మారథాన్ సమావేశాల్లో కలెక్టర్లు, ఎస్పీలతో ముఖ్యమంత్రి పలు కీలక అంశాలపై సమీక్షించారు. ముగింపు ఉపన్యాసంలో రాష్ట్ర సాగునీటి రంగంపై కీలక ప్రకటన చేస్తూ, 25 ప్రాధాన్యతా ప్రాజెక్టులను నిర్దిష్ట గడువులోగా పూర్తిచేసేందుకు ఉద్దేశించిన 'ఇరిగేషన్ క్యాలెండర్'ను విడుదల చేశారు. పాలనలో టీమ్ వర్క్ ప్రాధాన్యతను ముఖ్యమంత్రి నొక్కి చెప్పారు. "నేను అనే అహం వీడి, మనం అనే భావనతో కలిసికట్టుగా పనిచేస్తేనే అద్భుతమైన ఫలితాలు సాధించగలం. మన పాలన పూర్తిగా పౌర కేంద్రంగా (సిటిజెన్ సెంట్రిక్) ఉండాలి. నేను ప్రతి సోమవారం ప్రజాదర్బార్ ద్వారా ప్రజల సమస్యలు వింటున్నాను. ఇకపై మీరు కూడా ప్రతి శుక్రవారం ఒక నియోజకవర్గానికి వెళ్లి క్షేత్రస్థాయిలో ప్రజాదర్బార్ నిర్వహించి, ప్రజల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలి" అని అధికారులను ఆదేశించారు. అత్యుత్తమ పాలనా విధానాలను అధ్యయనం చేసేందుకు మంత్రుల బృందాన్ని సింగపూర్ పంపిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.

**అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం**

ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందాలని, కనీస అవసరాలు తీర్చడమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. "రాష్ట్రంలో రహదారులు, వీధిదీపాలు, మురుగునీటి పారుదల వంటి మౌలిక వసతులను మెరుగుపరచడంపై దృష్టి సారించాం. పేదల జీవన ప్రమాణాలను పెంచేందుకు 'పీ4' (ప్రజలు, ప్రైవేటు, ప్రభుత్వ భాగస్వామ్యం) కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం" అని వివరించారు. ప్రజలపై విద్య, వైద్యం, విద్యుత్ భారాన్ని తగ్గించేలా అధికారులు చొరవ చూపాలని, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి వాటిని సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. తాము నిర్వహించే సమీక్షలు, సమావేశాలన్నీ పేద, మధ్యతరగతి వర్గాల సంక్షేమం కోసమేనని గుర్తుంచుకోవాలన్నారు.

**పెట్టుబడుల ఆకర్షణలో ఏపీకి బ్రాండ్ ఇమేజ్**

రాష్ట్ర ప్రభుత్వ పారదర్శక విధానాల వల్ల గత 23 నెలల్లో నెలకు లక్ష కోట్ల చొప్పున మొత్తం రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, దీనివల్ల 24 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ముఖ్యమంత్రి తెలిపారు. "ఏపీకి ఉన్న బ్రాండ్ ఇమేజ్ కారణంగానే పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయి. శాంతిభద్రతలు అదుపులో ఉంటేనే ఇవి సాధ్యమవుతాయి. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలి" అని ఎస్పీలకు సూచించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇస్తున్నామని, వాటిని క్షేత్రస్థాయిలో ప్రారంభమయ్యేలా (గ్రౌండింగ్) చూసే బాధ్యత కలెక్టర్లు, ఎస్పీలు తీసుకోవాలని ఆదేశించారు. గూగుల్, రిలయన్స్ వంటి డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో వస్తున్న పెట్టుబడులు రాష్ట్ర భవిష్యత్తుకు సంకేతమని అన్నారు.

లాజిస్టిక్స్ హబ్‌గా ఏపీ... మౌలిక సదుపాయాల కల్పన

రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చంద్రబాబు తెలిపారు. "రాష్ట్రంలో రూ.1.03 లక్షల కోట్లతో జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతోంది. ఇచ్ఛాపురం నుంచి చెన్నై వరకు నాలుగు లైన్ల రైల్వే ట్రాక్ రాబోతోంది. రూ.10 వేల కోట్లతో పోర్టులు, ఎయిర్‌పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం చేపడుతున్నాం. ఈ ప్రాజెక్టులన్నీ పూర్తయితే ఏపీ దేశంలోనే కీలకమైన లాజిస్టిక్స్ హబ్‌గా మారుతుంది," అని సీఎం వివరించారు. ఈ ప్రాజెక్టుల వేగవంతమైన పూర్తికి భూసేకరణ వంటి అంశాలను కలెక్టర్లు చొరవ తీసుకుని పరిష్కరించాలని సూచించారు.రాష్ట్ర జీవనాధారమైన సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ముఖ్యమంత్రి ప్రకటించారు. "పోలవరం ప్రాజెక్టు ద్వారా కృష్ణా డెల్టాకు, విశాఖ పరిశ్రమలకు నీరందిస్తాం. ఈ ఏడాది వెలుగొండ ప్రాజెక్టును పూర్తిచేయబోతున్నాం. నేరడి బ్యారేజ్ పనులు కూడా ఈ ఏడాదే ప్రారంభిస్తాం. ఉత్తరాంధ్రలోని పెండింగ్ ప్రాజెక్టులను వచ్చే రెండేళ్లలో, రాయలసీమలో హంద్రీనీవా ద్వారా చివరి ఆయకట్టుకు నీరందించేలా ప్రణాళికలు సిద్ధం చేశాం.

# సిగ్నల్ ఫ్రీ సిటీగా హైదరాబాద్

(మొదటి పేజీ తరువాయి)

'హైదరాబాద్ నగరాన్ని ట్రాఫిక్ ఫ్రీ నగ రంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నాం. కీలకమైన ప్రాంతాల్లో అండర్‌పాస్‌లు, ఉపరితల రోడ్లు, ఎలివేటెడ్ కారిడార్ వంటి మూడు విధానాల్లో సులభతరమైన రవాణా మార్గాలను కల్పించే విధానాన్ని ఎంచుకున్నాం. పార్కింగ్ ఇబ్బందులను అధిగమించేందుకు నగరంలో మల్టీ లెవెల్ పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నాం'అని వివరించారు. తెలంగాణ రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ విభాగాలుగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. కాలుష్య కోరల నుంచి హైదరాబాద్‌ను కాపాడటానికి మూసీ రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేయడంతో పాటు నగర సంస్కృతికి అనుసంధానించ బోతున్నట్లు వివరించారు. నగర తాగునీటి సరఫరా, పట్టణాభివృద్ధి, మూసీ పునరుజ్జీవం తదితర అంశాలపై ప్రభుత్వ ప్రణాళికలను సమావేశంలో ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా స్టాండింగ్ కమిటీకి వివరించారు. నగర అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లడానికి కేంద్రం సహకరించాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ మాగుంట శ్రీనివాసులరెడ్డితోపాటు ఇతర సభ్యులు మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టును విప్లవాత్మక నిర్ణయంగా అభివర్ణించారు. హైదరాబాద్ నగర జీవన స్థితిగతులను మెరుగుపరిచే మూసీ పునరుజ్జీవ తరహా ప్రాజెక్టు దేశంలోనే మొదటిదని అభిప్రాయపడ్డారు. ఎంతో కీలకమైన ఈ ప్రాజెక్టును చేపట్టడంపై కమిటీ ముఖ్యమంత్రిని అభినందించింది. దీంతోపాటు రాష్ట్రంలో మహిళాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను కొనియాడింది. అంతకుముందు స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్‌తోపాటు సభ్యులను ముఖ్యమంత్రి సత్కరించారు. తెలంగాణ రైజింగ్ --2047 విజన్ డాక్యుమెంట్‌ను కమిటీ సభ్యులకు అందజేశారు. సమావేశంలో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నేడే తమిళనాడు సీఎంగా జోసెఫ్ విజయ్ ప్రమాణం

ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది. దీంతో నేటి(ఆదివారం) ఉదయం 10 గంటలకు చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో రాష్ట్ర గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ సమక్షంలో విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయనున్నారు. 234 మంది సభ్యులున్న శాసనసభలో కనీస మెజారిటీ(118)ని మించి ఎమ్మెల్యేల మద్దతును కూడగట్టడంలో సఫలీ కృతుడుకావడంతో విజయ్‌ను ముఖ్యమంత్రిగా నియమిస్తూ గవర్నర్ నిర్ణయం తీసుకున్నారని శనివారం తమిళనాడు లోక్‌భవన్ ఒక అధికారిక ప్రకటన విడుదలచేసింది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని విజయ్‌ను గవర్నర్ ఆహ్వానించారు. మే 13వ తేదీ లేదా అంతకన్నాముందే బలనిరూపణకు సిద్ధంగా ఉండాలని అధికారిక ఉత్తర్వులో విజయ్ పార్టీకి గవర్నర్ సూచించారు. అధికారిక ఉత్తర్వు వార్త తెలిసి తమిళగ వెట్రి కళగం(టీవీకే) పార్టీ శ్రేణుల్లో సంబరాలు అంబరాన్నంటాయి. తమిళనాడు వ్యాప్తంగా టీవీకే మద్దతుదారులు పెద్దమొత్తంలో బాణసంచా కాల్చారు. మిఠాయిలు పంచి ఆనందాన్నీ పంచుకున్నారు.

**మద్దతుతో ముందుకు...**

తొలుత ఐదుగురు సభ్యులున్న కాంగ్రెస్ మాత్రమే టీవీకే పార్టీకి మద్దతు పలకగా తర్వాత సీపీ(2)ఎం, సీపీఐ(2) వెంట నడిచాయి. శనివారం విదుథలై చిర్నథైగల్ కట్చి(వీసీకే), ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్(ఐయూఎంఎల్) సైతం కలిసివస్తామని హామీ ఇవ్వడంతో 107 ఎమ్మెల్యేలున్న టీవీకే పార్టీకి మొత్తం బలం ఒకేసారి 120కి పెరిగింది. వెనువెంటనే గవర్నర్‌కు మేజిక్ ఫిగర్ అంశాన్ని తెలియజేసేందుకు విజయ్ లోక్‌భవన్‌కు బయల్దేరగా అపాయింట్‌మెంట్ చివరినిమిషంలోనూ ఖరారుకాకపోవడంతో మార్గమధ్యం లోనే నిరాశగా వెనుతిరిగారు. పదేపదే తిప్పుతూ గవర్నర్ ఉద్దేశపూర్వకంగా విజయ్‌ను వేధిస్తున్నారని వెంటనే సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎం.వీరపాండియన్ అన్నారు. నిష్క్రమించిన కొద్దిసేపటికే సాయంత్రం ఆరుగంటల తర్వాత గవర్నర్ నుంచి విజయ్‌కు పిలుపు వచ్చింది. ఈసారి కాంగ్రెస్ తమిళనాడు రాష్ట్ర చీఫ్ కె.సెల్వపెరుంథగై, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.షణ్ముగం, సీపీఎం ముఖ్య నేత బాలకృష్ణన్, వీసీకే ముఖ్యనేతలతో కలిసి గవర్నర్‌తో సమావేశమయ్యారు. 120 మంది ఎమ్మెల్యేల మద్దతు తనకుందని స్పష్టంచేస్తూ జాబితాను గవర్నర్‌కు విజయ్ బృందం అందజేసింది. గంటకుపైగా సుదీర్ఘ భేటీ తర్వాత విజయ్ మెజార్టీని అంగీకరిస్తూ తదుపరి ప్రభుత్వ ఏర్పాటుకు ఉన్న అడ్డంకులను గవర్నర్ తొలగించారు. తమిళనాడు తదుపరి సీఎంగా మీరే ఉండాలంటూ సంబంధిత లేఖను విజయ్‌కు గవర్నర్ అందజేశారు. దీంతో సీఎంగా విజయ్ ప్రమాణస్వీకారానికి శ్రీకారం చుట్టినట్లయింది. విజయ్ సారథ్యంలోని ప్రభుత్వానికి బేషరతుగా మద్దతు తెలుపుతున్నట్లు వీసీకే, ఐఎంయూఎల్ తెలిపాయి. కానీ తాము ఇంకా డీఎంకే సారథ్యంలోని కూటమిలోని కొనసాగుతామని, టీవీకే సర్కార్‌కు బయటి నుంచి మద్దతు ఇస్తామని వీసీకే ప్రకటించడం గమనార్హం. సీపీఎం, సీపీఐలు అధికారికం గా మద్దతు ఇచ్చినా, వీసీకే నేత థోల్ తిరుమావళవన్ నుంచి ఎలాంటి సమాచారం లేక పోవడంతో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్కంఠ భరిత వాతావరణం నెలకొంది.

# బెంగాల్ సీఎంగా సువేందు ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

సమక్షంలో అత్యంత అట్టహాసంగా ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిర్వహించారు. గవర్నర్ ఆర్ఎన్ రవి అధికారి చేత ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయించారు. తర్వాత ఉప్పొంగిపోయిన ప్రధాని తమకు అపూర్వ విజయాన్ని అందించిన బెంగాల్ ఓటర్లకు మోకాళ్లపై ఒంగి నేలకు తల ఆన్చి నమస్కారంచేశారు. ఈ సందర్భంగా బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లోని ప్రమాణస్వీకార ప్రాంగణం జైశ్రీరాం, భారత్ మాతాకీ జై నినాదాలతో మార్మోగిపోయింది. భవానీపూర్‌లో మమతా బెనర్జీని మట్టికరిపించి, నందిగ్రామ్‌లో విజయాన్ని సాధించిన సువేందుకు ప్రధాని ప్రమాణ స్వీకారం తర్వాత శుభాకాంక్షలు తెలిపారు. సువేందు తర్వాత సీనియర్ బీజేపీ నేత దిలీప్ ఘోష్, అగ్నిమిత్ర పాల్, అశోక్ కీర్తనీయ, క్షుదిరాం టుడు, నితీశ్ ప్రామాణిక్‌లు కేబినెట్ మంత్రులుగా ప్రమాణం చేశారు. బ్రాహ్మణ, ఓబీసీ, గిరిజన, కాయస్థ, మథువా, రాజ్‌వంశీ ఇలా ఆరు సామాజిక వర్గాలకు చెందిన నేతలను కేబినెట్‌లోకి తీసుకుని బీజేపీ తమ సామాజిక సమానత్వాన్ని చాటింది. రాష్ట్రంలో ఉత్తర, దక్షిణ ప్రాంతాల నేతలకు సమప్రాధాన్యతనిచ్చింది.

# బండి సంజయ్ కుమారుడిపై పోక్సో కేసు

(మొదటి పేజీ తరువాయి)

శుక్రవారం రాత్రి ఫిర్యాదురాగా పేట్ బషీరాబాద్ సీఐ విజయవర్ధన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ (24) డిసెంబర్ 31న మొయినాబాద్‌లోని ఓ ఫామ్ హౌస్‌లో స్నేహం పేరిట తిరుగుతూ పెళ్లి చేసుకుంటానని నమ్మించి అదే రోజు రాత్రి అసభ్యకరంగా ప్రవర్తించాడనేది ప్రధాన ఆరోపణ. భగీరథపై పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్ 74, 75తోపాటు సెక్షన్ 11 రెడ్‌విత్ 12 పోక్సో చట్టం కింద నమోదు చేశారు. భగీరథపై గతంలో బహదూర్‌పల్లిలో ఉన్న కళాశాలలో ర్యాగింగ్‌తోపాటు డ్రగ్స్ విషయంపై ఫిర్యాదులు రాగా దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కాగా, ప్రధాని మోదీ నగరానికి విచ్చేస్తున్న నేపథ్యంలో కేంద్ర మంత్రి కుమారుడిపై పోక్సో కేసు నమోదుకావడం చర్చనీయాంశమైంది. స్నేహం పేరుతో తనను బ్లాక్‌మెయిల్ చేస్తూ వివాహానికి ఒత్తిడి తెచ్చారని బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ ఒక యువతిపై కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రూ.5 కోట్లు డిమాండ్ చేస్తూ బెదిరింపులకు పాల్పడ్డారని పేర్కొన్నారు.



## పొన్నం ప్రభాకర్ కు బర్త్ డే విషెస్

**- మర్యాదపూర్వకంగా కలిసిన గోదాసు పృథ్వీరాజ్**

**తొలివెలుగు, రామన్నపేట:** రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదినాన్ని పురస్కరించుకుని పలువురు రాజకీయ ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రిని టిపిసిసి మాజీ కార్యదర్శి గోదాసు పృథ్వీరాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ప్రజా సేవలో మరిన్ని ఉన్నత పదవులు అధిష్టించాలని ఈ సందర్భంగా పృథ్వీరాజ్ ఆకాంక్షించారు.

## వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే వీరేశం

**- ఇంద్రపాలనగరంలో భానుచందర్ వివాహ వేడుకకు హాజరు**

**- పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు**



**తొలివెలుగు, రామన్నపేట:** మండల పరిధిలోని ఇంద్రపాలనగరం (బోగారం) గ్రామానికి చెందిన బంగారుగల్ల భానుచందర్ వివాహ వేడుక శనివారం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు నకిరేకల్ శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ వేముల వీరేశం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతన వధూవరులను ఆయన పుష్పగుచ్ఛం అందజేసి, అక్షింతలు వేసి ఆశీర్వదించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులతో కాసేపు ముచ్చటించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, మాజీ ఎంపీపీ పూస బాలనరసింహ, జిల్లా నాయకులు పూస బాలకిషన్, గంగుల వెంకట్ రాజి రెడ్డి పాల్గొన్నారు. వారితో పాటు వివిధ గ్రామాల వార్డు సభ్యులు, మండల నాయకులు, గ్రామ స్థాయి నాయకులు, పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొని సందడి చేశారు.

## భక్తిశ్రద్ధలతో కంఠమహేశ్వర స్వామి పండుగ

**- దుబ్బాకలో రెండు రోజుల పాటు వేడుకలు**

**- ముస్తాబైన ఆలయం.. అధికారులకు ఆహ్వానాలు**







**తొలివెలుగు, రామన్నపేట:** మండల పరిధిలోని దుబ్బాక గ్రామంలో వెలిసిన శ్రీ కంఠమహేశ్వర స్వామి పండుగను సోమ, మంగళవారాల్లో ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గౌడ కులస్థుల ఆధ్వర్యంలో జరగనున్న ఈ వేడుకలకు ఆలయ ప్రాంగణంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, ఈ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించనున్న శ్రీ కంఠమహేశ్వర ఆలయ ప్రతిష్టాపన మహోత్సవానికి రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై డి. నాగరాజును నిర్వాహకులు శనివారం ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ మేరకు వారికి ఆహ్వాన పత్రికలను అందజేశారు. కార్యక్రమంలో గుండాల అంజయ్య గౌడ్, గుండాల యాదయ్య గౌడ్, గుండాల సతీష్ గౌడ్, గుండాల నరసింహ గౌడ్, బత్తుల రమేష్ గౌడ్, గుండాల శేఖర్ గౌడ్, గంగాని రమేష్ గౌడ్, గుండాల వెంకటేశం గౌడ్ తదితరులు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ వేడుకలను భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

## అభివృద్ధిని చూసి ఓర్వలేకే దుష్ప్రచారం: సర్పంచ్ నరేష్

**- రైతుల కోసమే చెరువులో పూడికతీత**

**- ఆరోపణలు రుజువు చేస్తే దేనికైనా సిద్ధం**

**తొలివెలుగు, రాజాపేట:** మండలంలోని దూది వెంకటాపురం గ్రామాభివృద్ధిని చూసి ఓర్వలేకనే కొందరు తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని గ్రామ సర్పంచ్ నరేష్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామంలోని చెరువుకు నీటి వనరులు తక్కువగా ఉన్నాయని, అధికారుల సూచన మేరకు సాగునీటి నిల్వ సామర్థ్యం పెంచేందుకు పూడిక మట్టి తీయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ విషయమై గ్రామ పంచాయతీలో రైతులందరి ఆమోదంతో తీర్మానం చేశామని, తీసిన మట్టిని రైతుల పొలాల్లోనే వేసుకుంటున్నారని స్పష్టం చేశారు. తాను దళిత సర్పంచ్ కావడంతోనే కించపరిచేలా వ్యవహరిస్తున్నారని, రాజకీయంగా ఎదుర్కోలేక బురదజల్లుతున్నారని మండిపడ్డారు. తాను మట్టిని అమ్మినట్లు రుజువు చేస్తే ఎలాంటి శిక్షకైనా సిద్ధమని సవాల్ విసిరారు. ఎమ్మెల్యే ఆశీస్సులతో గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని, అభివృద్ధికి ఆటంకం కలిగించవద్దని ఆయన కోరారు.

# సూరారంలో దళితులపై దారుణం..

# బోనం పగలగొట్టి దాడి!



- అడ్డుకున్న అగ్రవర్ణ అహంకారులు.. హత్యాప్రయత్నం
- వెంటనే రిమాండ్ చేయకుంటే జిల్లావ్యాప్త ఆందోళనలు: దుబ్బ రామకృష్ణ మాదిగ
- బాధితుల ఇళ్లకు వెళ్లి పరామర్శించిన ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు



**తొలివెలుగు, రామన్నపేట:** దళితులపై దాడులకు పాల్పడటం, కుల వివక్ష చూపడం అత్యంత అమానుషమని ఎమ్మార్పీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు దుబ్బ రామకృష్ణ మాదిగ అన్నారు. రామన్నపేట మండలం సూరార గ్రామంలో దళితులపై జరిగిన దాడి ఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ నెల 7వ తేదీన సూరార గ్రామంలో కోట మైసమ్మ పండుగ సందర్భంగా దళితులు బోనాలు సమర్పిస్తుండగా కొందరు అడ్డుకున్న విషయం విదితమే. “దళితులై ఉండి మీరు ముందుగా బోనాలు పెడతారా?” అంటూ కులంపేరుతో దూషించి, బోనాలను పగలగొట్టడమే కాకుండా, వారిపై భౌతిక దాడికి దిగి తలలు పగలగొట్టినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణహాని తలపెట్టేలా జరిగిన ఈ దాడి విషయం తెలుసుకున్న దుబ్బ రామకృష్ణ మాదిగ నేతృత్వంలోని ఎమ్మార్పీఎస్ బృందం సూరార గ్రామానికి చేరుకుని బాధితులను పరామర్శించింది. జరిగిన ఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు గడుస్తున్నా, నేటికీ దళితులపై అంటరానితనం, వివక్ష కొనసాగడం, కులం పేరుతో అవమానిస్తూ దాడులకు తెగబడటం బాధాకరమన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ హత్యా ప్రయత్నాలకు పాల్పడుతున్న అగ్రవర్ణ అహంకారులను వెంటనే అరెస్టు చేయాలని పోలీసులను డిమాండ్ చేశారు. నిందితులను కఠినంగా శిక్షించి, రిమాండ్‌కు తరలించని పక్షంలో యాదాద్రి జిల్లా వ్యాప్తంగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు శివగాళ్ళ మల్లన్న, మండల అధ్యక్షులు నోముల చిరంజీవి, నాయకులు మారయ్య, కోట రమేష్, చిరుమర్తి సైదులు, చిరుమర్తి ఉపేందర్, వెంకటేష్, నరసింహ, బందెలా సైదులు, బందెలా నర్సింహా, బందెలా మహేష్, మేడి బందెలా భిక్షం, బందెలా రమణ, బందెలా యాదమ్మ, పలువురు కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలు





**- ముగిసిన అభయాంజనేయ స్వామి ఆలయ ఉత్సవాలు**

**- దాతలకు, భక్త బృందానికి ఘన సత్కారం**

**తొలివెలుగు, రాజాపేట:** మండల కేంద్రంలోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో మూడు రోజుల పాటు కొనసాగిన ధ్వజస్తంభం, సూర్యనారాయణ మూర్తి, సంతాన నాగేంద్ర స్వామి విగ్రహాల ప్రతిష్ట మహోత్సవాలు శుక్రవారంతో వైభవంగా ముగిశాయి. ఆలయ అర్చకులు చలివేదుల రాజేశ్వర శర్మ ఆధ్వర్యంలో జోషి మల్లికార్జున శర్మ, రాజేశ్వర్ శర్మలు శాస్త్రోక్తంగా వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిష్టా పూజా కార్యక్రమాలను పర్యవేక్షించిన గౌరీభట్ల సుబ్రహ్మణ్య శర్మకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన ధ్వజస్తంభానికి మొదటి హారతి ఇచ్చి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్వజస్తంభ దాత తోరణాల సంజయ్ గుప్తా, చంద్రకళ దంపతులను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. అన్నప్రసాద వితరణలో సేవలందించిన ‘జై శ్రీమన్నారాయణ’ భక్త బృందాన్ని ప్రత్యేకంగా సన్మానించారు. మూడు రోజుల పాటు జరిగిన ఈ వేడుకల విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు. గౌరవ అధ్యక్షులు సోమసాని రాజమల్లయ్య, అధ్యక్షులు బెడిద నర్సింలు, పెరిక కుల సంఘం జిల్లా అధ్యక్షులు మేడిశెట్టి సత్యనారాయణ దంపతులు, కుల సంఘం నాయకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




# చెరువు ప్రవాహానికి ‘మట్టి’ పోటు!

**- ఎఫ్.టి.ఎల్ పరిధిలో అక్రమ కట్టడాల పర్వం**

**- పట్టించుకోని యంత్రాంగం.. రైతుల ఆగ్రహం**

**- 1000 ఎకరాల సాగుపై ప్రభావం!**

**- అధికారులకు ఇస్కిల్లా రైతుల ఫిర్యాదు**



**తొలివెలుగు, రామన్నపేట:** వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకం కలిగిస్తూ అక్రమ కట్టడాలు నిర్మిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మండలంలోని ఇస్కిల్లా గ్రామ రైతులు శుక్రవారం రెవెన్యూ, సాగునీటి పారుదల శాఖ అధికారులను ఆశ్రయించారు. గ్రామంలోని ఆసిఫ్ నహార్ కాల్వ పరిధిలో ఉన్న పోతారపు చెరువుకు సహజ సిద్ధంగా వచ్చే వరద నీటిని అడ్డుకుంటూ ఎఫ్.టి.ఎల్, బఫర్ జోన్ పరిధిలో ఏనుగు సత్తిరెడ్డి అనే రైతు అక్రమంగా మట్టి కట్ట నిర్మిస్తున్నారని రైతులు కాకులారపు జనార్ధన్ రెడ్డి, శంతన్ రెడ్డి, యాదిరెడ్డి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోతారపు చెరువు నీటిపై ఇస్కిల్లా, కక్కిరేణి గ్రామాల్లో సుమారు 1000 ఎకరాల సాగు ఆధారపడి ఉందన్నారు. ఇప్పుడు అక్రమంగా ఎత్తైన కట్టను నిర్మించడం వల్ల చెరువు నీటి నిల్వ సామర్థ్యం తగ్గడమే కాకుండా, ప్రధాన కట్టపై ఒత్తిడి పెరిగి తెగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అంతేకాకుండా, ఎగువ ప్రాంతాల్లోని పొలాల్లో నీరు నిలిచి పంటలు దెబ్బతినే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే స్పందించి సహజ ప్రవాహానికి అడ్డుగా ఉన్న మట్టి కట్టను తొలగించి, రైతులకు న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో గ్రామ రైతులు తదితరులు ఉన్నారు.



## భూపతి రామయ్య మృతికి సంతాపం

**- జర్నలిస్టు శ్రీనివాస్ కు పితృవియోగం..**

**- నివాళులర్పించిన బీసీ సంక్షేమ సంఘం నేత జూకంటి**

**తొలివెలుగు, రాజాపేట:** 'ప్రజా అక్షరం' దినపత్రిక ఎడిటర్, సీనియర్ జర్నలిస్టు భూపతి శ్రీనివాస్ తండ్రి భూపతి రామయ్య శనివారం కన్నుమూశారు. ఆయన మరణవార్త తెలుసుకున్న రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం నాయకులు జూకంటి ప్రవీణ్ కుమార్ బూరుగుపల్లి గ్రామానికి చేరుకుని రామయ్య భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామయ్య తన జీవితాంతం విలువలతో కూడిన జీవనం గడిపారని కొనియాడారు. అనంతరం శోకతప్త హృదయంతో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. రామయ్యకు నివాళులర్పించిన వారిలో ఎమ్మార్పీఎస్ నాయకులు మొత్కుపల్లి నవీన్ కుమార్, క్రైస్తవ మత పెద్దలు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## రాజకీయాలు వేరు.. పలకరింపులు వేరు

**- కార్లు ఆపి ముచ్చటించుకున్న రాజగోపాల్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి**

**- తగ్గేదేలే అన్నట్టుండే నేతలు.. తగ్గుతూ పలకరించుకున్న తీరు**

**- ధాన్యం కొనుగోళ్లపై మాజీ ఎమ్మెల్యే విన్నపం.. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే**



**తొలివెలుగు, చౌటుప్పల్:** రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరనే నానుడిని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి నిజం చేశారు. శనివారం చౌటుప్పల్ పట్టణంలో వివిధ శుభకార్యాలకు హాజరైన వీరిద్దరూ ఎదురెదురుగా వస్తున్న తమ వాహనాలను ఆపి మరీ పలకరించుకున్నారు. కారు దిగి ఒకరికొకరు అభివాదం చేసుకున్న అనంతరం ప్రస్తుత రాజకీయ, స్థానిక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో వరి ధాన్యం కొనుగోళ్లు నెమ్మదిగా సాగుతున్నాయని, రైతులు ఇబ్బంది పడకుండా చూడాలని ప్రభాకర్ రెడ్డి కోరారు. దీనిపై ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి స్పందిస్తూ.. గతంతో పోలిస్తే ఈ ఏడాది ఆరు నుంచి ఏడు రెట్లు అధికంగా దిగుబడి వచ్చిందని, ఇప్పటికే అధికారులతో సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. లారీల సంఖ్యను పెంచి ధాన్యం తరలింపు వేగవంతం చేయాలని ఆదేశించానని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు. బద్ధ రాజకీయ ప్రత్యర్థులు ఇలా ఆప్యాయంగా మాట్లాడుకోవడం నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది.

## కారు ఢీకొని లారీ డ్రైవర్ మృతి

**- పెట్రోల్ అయిపోయి స్కూటీ తోస్తుండగా ప్రమాదం**

**- భీమనపల్లి గ్రామంలో విషాద ఛాయలు**



**తొలివెలుగు, చౌటుప్పల్:** హైవేపై స్కూటీని తోసుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిని వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. చౌటుప్పల్ ఇన్‌స్పెక్టర్ జి. మన్మథ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పోచంపల్లి మండలం భీమనపల్లి గ్రామానికి చెందిన మీసాల యాదయ్య (54), వృత్తిరీత్యా లారీ డ్రైవర్. భద్రాచలం నుంచి పేపర్ లోడుతో హైదరాబాద్ వచ్చిన ఆయన, అన్లోడ్ చేసిన అనంతరం లారీని మల్కాపురం వద్ద ఉన్న దాబా దగ్గర ఆపారు. తన స్కూటీ (టీఎస్ 30 బీ 995) పై గ్రామానికి వెళ్లి, తిరిగి శనివారం తెల్లవారుజామున 3:30 గంటల సమయంలో లారీ వద్దకు బయలుదేరారు. మార్గమధ్యలో మల్కాపురం చెరువు వద్దకు రాగానే స్కూటీలో పెట్రోల్ అయిపోయింది. దీంతో ఆయన వాహనాన్ని హైవే పక్కన తోసుకుంటూ వెళ్తుండగా, వెనుక నుంచి అతివేగంగా వచ్చిన కారు (టీఎస్ 07 జీజీ 8319) బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యాదయ్య తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు మృతదేహాన్ని చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కారు డ్రైవర్ ధూపాటి కళ్యాణ్ కృష్ణ (హైదరాబాద్) పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుమారుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథ కుమార్ తెలిపారు.

## ఐకెపి ధాన్యం దిగుమతిలో జాప్యం.. బిజెపి ఆందోళన





**- రైస్ మిల్లు ముందు బైఠాయించిన నేతలు**

**- తహసీల్దార్ హామీతో విరమణ**

**తొలివెలుగు, రాజాపేట:** ఐకెపి కొనుగోలు కేంద్రాల ద్వారా వస్తున్న ధాన్యం దిగుమతిలో రైస్ మిల్లర్లు కావాలనే జాప్యం చేస్తున్నారని విమర్శిస్తూ శనివారం బిజెపి ఆధ్వర్యంలో రాజాపేటలో ఆందోళన నిర్వహించారు. మండల కేంద్రంలోని మణికంఠ పారాబైల్డ్ రైస్ మిల్లు వద్ద పార్టీ శ్రేణులు ధర్నాకు దిగాయి. దళారుల నుంచి వస్తున్న ధాన్యాన్ని వెనువెంటనే తీసుకుంటున్న మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన లారీలను మాత్రం మూడు రోజులుగా నిలిపివేస్తూ రైతులను, డ్రైవర్లను ఇబ్బందులకు గురిచేస్తున్నారని బిజెపి మండల అధ్యక్షుడు మేకల రమేష్ ధ్వజమెత్తారు. మిల్లు ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేయడంతో సమాచారం అందుకున్న తహసీల్దార్ వల్లపు ప్రదీప్ అక్కడికి చేరుకున్నారు. సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని, ధాన్యం దిగుమతి వేగవంతం చేస్తామని ఆయన హామీ ఇవ్వడంతో రైతులు, బిజెపి నేతలు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దాచేపల్లి రాజు, మెండు భగవాన్ రెడ్డి, దాచేపల్లి శ్రీనివాస్, గాండ్ల నర్సింగరావు, కుమ్మరి లక్ష్మణ్, బూరుగు శేఖర్ రెడ్డి, సాధనబోయిన శంకర్, చిగుళ్ల బీరయ్య, గవ్వల అనిల్ కుమార్, ఐరేణి శ్రీధర్, కుంట కరుణాకర్ రెడ్డి, సంగెమ్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ నూర్జహాన్ జీవితం స్ఫూర్తిదాయకం

**సీపీఎం రాష్ట్ర నాయకులు**



**తొలివెలుగు, ఆత్మకూరు(ఎం):** సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు కార్మికోద్యమ నాయకురాలు కామ్రేడ్ నూర్జహాన్ జీవితం స్ఫూర్తిదాయకమని ఆమె మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యురాలు టి.జ్యోతి,జిల్లా కార్యదర్శి ఎండీ జాహింగీర్లు మాట్లాడుతూ అభిప్రాయపడ్డారు.యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం పల్లెర్ల గ్రామంలో శనివారం రోజు ప్రజానాట్యమండలి రాష్ట్ర మాజీ అధ్యక్షులు వేముల ఆనంద్ జీవిత సహచరి కామ్రేడ్ నూర్జహాన్ సంతాప సభ సీపీఎం సీనియర్ నాయకులు వంటిపెంటి గోపాల్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. త్యాగం, ఆశయం, ప్రజలపై అచంచలమైన విశ్వాసంతో ఉద్యమాల్లో సమరశీలంగా ముందు వరుసలో నిలబడిన ధీర వనిత అని ఆమె లేని లోటు పుడ్చలేనిది అని అన్నారు.ఈ సంతాప సభలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి ఏ.రమేష్ బాబు,పెద్ది వెంకట్రాములు, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్టా నర్సింహా,జక్కిడి నర్సింహా రెడ్డి, ఈర్లపల్లి ముత్యాలు,నాగటి మారన్న, ప్రజా వాగ్గేయకారులు చింతల యాదగిరి,కాకం అంజన్న,పాటల వెంకన్న, చంద్రమౌళి, అమరావతి,శివ, రాము, కామ్రేడ్ నూర్జహన్ పై నివాళి గీతాలు ఆలపించారు. మరియు యాదాద్రి భువనగిరి జిల్లా సీపీఎం జిల్లా నాయకులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి,గూడూరు అంజిరెడ్డి, సంగు నరేందర్,గడ్డం వెంకటేష్, మండల నాయకులు వేముల భిక్షం,రచ్చ గోవర్ధన్, నాగయ్య,బుగ్గయ్య,యాదిరెడ్డి, రాంరెడ్డి,హమీద్, స్వామి, సదానంద్,దయానంద్ మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కుంభం పౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్ మేళాలో ఆన్‌లైన్ చేసుకున్న ప్రతి ఒక్క నిరుద్యోగి రేపు నిర్వహించే ఇంటర్వ్యూలలో పాల్గొనాలి





**కుంభం ఫౌండేషన్ చైర్మన్ కుంభం కీర్తి రెడ్డి**

**తొలివెలుగు,యాదాద్రి భువనగిరి :**యాదాద్రి భువనగిరి జిల్లా శనివారం రోజు కుంభం పౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్ మేళా 2వ రోజు సందర్భంగా వన్ మిలియన్ వన్ బిలియన్ సంస్థ సహకారంతో సుమారు 27 కంపెనీలు రేపు నిర్వహించే జాబ్ మేళాలో పాల్గొనడం కోసం శనివారం రోజు కూడా సుమారు 800 మంది విద్యార్థులు యువకులు నిరుద్యోగులు ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ చేసుకున్నరని కుంభం పౌండేషన్ చైర్మన్ కీర్తి రెడ్డి తెలపడం జరిగింది.ఆదివారం నిర్వహించే ఇంటర్వ్యూలలో దాదాపుగా 2600 మంది ఆన్ లైన్లో రిజిస్ట్రేషన్లు చేసుకున్న ప్రతి నిరుద్యోగి ఆదివారం నిర్వహించే ఇంటర్వ్యూలలో పాల్గొనవలసిందిగా కుంభం పౌండేషన్ చైర్మన్ కీర్తి రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా కీర్తి రెడ్డి మాట్లాడుతూ దక్షిణ తెలంగాణ ప్రాంతంలో ఉమ్మడి నల్గొండ జిల్లా భువనగిరి నియోజకవర్గంలో ఎంతోమంది నిరుపేద కుటుంబాలలో ఉన్నతమైన విద్య అభ్యసించినప్పటి కూడా నిరుద్యోగంతో అవస్థలు పడుతూ ఉద్యోగ అవకాశాలు దొరకకపోవడం వల్ల మంచి విద్యార్హతలు నైపుణ్యం కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగి ఉన్న వాళ్లకు సరైన రీతిలో ప్రోత్సాహం దొరకడం లేదనే ఆలోచనతో మా కుంభం ఫౌండేషన్ ఆధ్వర్యంలో వన్ మిలియన్ సంస్థ సహకారంతో ఈ జాబ్ మేళా అన్ని రకాల మౌలిక వసతులతో 150 మంది స్వచ్ఛంద వాలంటీర్లతో విద్యార్థులకు యువకులకు నిరుద్యోగులకు మంచినీటి వసతి భోజన వసతి అన్ని కల్పిస్తూ ముఖ్యంగా ఆదివారం ఇంటర్వ్యూలలో పాల్గొనే విద్యార్థులకు యువకులకు నిరుద్యోగులకు మరియు వారి తల్లిదండ్రులకు భువనగిరి బస్టాండ్ నుండి ఉదయం 7 గంటల నుండి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేపించి న్యూ డైమెన్షన్ స్కూల్ వరకు రవాణా సౌకర్యం కూడా ఉచితంగా కల్పించడం జరుగుతుంది.దేశ వ్యాప్తంగా పలు ముఖ్య కంపెనీల హెచ్ఆర్ లు కూడా ఈఇంటర్వ్యూలలో పాల్గొనడం జరుగుతుంది. వారి ముందట మీ యొక్క నైపుణ్యత కమ్యూనికేషన్ స్కిల్స్ వక్తపరిచి మీరు మంచి ఉద్యోగ అవకాశాలు పొందాలని కోరుకుంటున్నాను. మీకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా కుంభం పౌండేషన్ అండగా ఉంటుందని తెలపడం జరిగింది.ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి పోతన ప్రమోద్ కుమార్ ,బాబా ఇన్రా డెవలపర్ చైర్మన్ మజీద్ బాబా ,జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేస్ చిస్తీ, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల, కౌన్సిలర్ లయిక్ అహ్మద్, బొంతల నరసింహ, షేక్ మజార్ పాషా, బబ్లు ,పడిగెల ప్రదీప్, మజార్, చిక్కుల వెంకటేశం, మంగా ప్రవీణ్, వాసుదేవ, రెడ్డి, వస్తువుల సాయి నిఖిల్ ఏడుమేకల మహేష్, పోత్నక్ సత్య ,శివప్రసాద్, బత్తుల నగేష్, మసూద్, లపాల్గొన్నారు.

## యాదగిరిగుట్టలో వైభవంగా వివాహ వేడుక



**తొలివెలుగు,ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య శనివారం రోజు యాదగిరిగుట్టలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బొమ్మగాని లక్ష్మీప్రసన్న బాలరాజు వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యసంపదలతో కళకళలాడాలని ఆకాంక్షించారు.

## పనులు ప్రారంభించిన ఆలేరు మున్సిపల్ చైర్పర్సన్ 10వ వార్డు కౌన్సిలర్



**తొలివెలుగు,ఆత్మకూరు(ఎం):**యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపల్ 10 వార్డులోని కుమ్మరివాడ ఈదమ్మ గుడి దగ్గరలో జెసిబీ సహాయంతో కచ్చా కాలువను శుభ్రపరిచేందుకు గాను శనివారం రోజు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించిన ఆలేరు మున్సిపల్ చైర్మన్ బీజన బాలమణి భాస్కర్ పదవ వార్డు కౌన్సిలర్ మల్లెల సరిత శ్రీకాంత్. మున్సిపల్ వైస్ చైర్మన్ అంగడి ఆంజనేయులు,కౌన్సిలర్స్ వానరాసి మరియమ్మ మార్క్ , పస్తం ఆంజనేయులు,జెట్ట నీరజ సిద్దులు,కోప్షన్ మెంబర్ ఎంఎస్ విజయ్ కుమార్ , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పిఎసిఎస్ డైరెక్టర్ సాగర్ రెడ్డి ,కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జైనోద్దీన్, కొన్నె మల్లేష్ ,బిళ్ళ సుధాకర్, ఎగ్గిడి బాలరాజు , బందేల విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని మోదీ సభకు ఆహ్వాన సందేశం
## ఆలేరు యువనాయకులు బిరుకూరి ప్రదీప్

**ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హైదరాబాద్ సందర్శన - 10వ మే 2026**

**ప్రియ తెలంగాణ ప్రజలు, బీజేపీ కార్యకర్తలు, సహయోధులు,**



**తొలివెలుగు,ఆత్మకూరు(ఎం):**భారతదేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మే 10, 2026న హైదరాబాద్‌కు విచ్చేస్తున్నారు. ఈ సందర్భంగా అనేక అభివృద్ధి ప్రాజెక్టులను (సుమారు ?7,800 కోట్ల విలువైన) ప్రారంభించి, ప్రజలకు అంకితం చేస్తారు. అనంతరం పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ సందర్శన కేవలం అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభం మాత్రమే కాదు – తెలంగాణలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఏర్పాటు చేసి, 2027 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించాలనే దృఢ సంకల్పంతో కూడిన ముఖ్యమైన అడుగు. మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నట్లు తెలంగాణ కూడా వేగంగా ముందుకు సాగాలనేది మన లక్ష్యం.తెలంగాణ ప్రజలందరూ, ముఖ్యంగా బీజేపీ కార్యకర్తలు, స్వయం సేవకులు,అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ చారిత్రక సభను విజయవంతం చేయాలి.మన అందరి ఉత్సాహం, ఒక్కట్టు, సమ్మేళనం ద్వారా తెలంగాణ అభివృద్ధి మరియు బీజేపీ విజయ యాత్రకు బలం చేకూర్చాలని ఆలేరు బిజెపి యువనాయకులు బిరుకూరి ప్రదీప్ కోరుతున్నారు.

## బాలయ్యతో ప్రత్యేక గీతం?



అగ్ర కథానాయకుడు బాలకృష్ణ సినిమాలకీ ప్రత్యేక గీతాలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంటాయి. ప్రస్తుతం సెట్స్‌పై ఉన్న ఆయన కొత్త చిత్రంలోనూ ప్రత్యేకగీతం ఉంటుందట. ఆ పాట కోసం కసరత్తులు మొదలైనట్టు తెలుస్తోంది. బాలీవుడ్ నుంచి టాలీవుడ్ వరకూ పలువురు కథానాయికల పేర్లని పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే బాలీవుడ్ భామ నర్గీస్ ఫక్రీ పేరు తెరపైకొచ్చింది. త్వరలోనే కథానాయిక ఎంపికని పూర్తి చేసి పాటని తెరకెక్కించనున్నట్టు సమాచారం. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా చేసుకుంటోంది. 'వీరసింహారెడ్డి' తర్వాత ఆ కలయికలో రూపొందుతున్న చిత్రమిది. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు.



## దుల్కర్ ఆట ఆగస్టులో

'ఐ యామ్ గేమ్' చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించనున్నారు కథానాయకుడు దుల్కర్ సల్మాన్. ఆయన నటించిన ఈ 40వ సినిమాని నహాస్ హిదాయత్ తెరకెక్కించారు. దుల్కర్, జోమ్ వర్గీస్ నిర్మించారు. కయాదు లోహర్ కథానాయిక. ఈ సినిమా ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉంది. ఈ నేపథ్యంలోనే దీన్ని ఆగస్టులో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు దుల్కర్ సల్మాన్ వెల్లడించారు. 'నేనిప్పటి వరకు చేసిన సినిమాల్లో అత్యంత స్టైలిష్ చిత్రమిది. దీంట్లో దర్శకుడు నహాస్ నన్ను ఓ కొత్త అవతారంలో చూపించారు. ఇందులో నా పాత్రతో పాటు కథా ప్రపంచమంతా చాలా ఆధునికంగా ఉంటుంద''ని తెలియజేశారు. దుల్కర్ కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో నిర్మితమవుతున్న ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో ఒకేసారి విడుదల కానుంది.

# నేను కాకుండా వేరొకరైతే బాగుండేది



ఏక్ దిన్' సినిమాను అంగీకరించడానికి ఆమిర్ ఖాన్‌తో ఉన్న అనుబంధమే ముఖ్య కారణమని అంటోంది సాయి పల్లవి. ఆమె, జునైద్ ఖాన్ జంటగా నటించిన చిత్రమిది. ఆమిర్ నిర్మాణంలో రూపొందిన ఈ ప్రేమకథా చిత్రం ఇటీవలే విడుదలై ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సాయి పల్లవి ఈ సినిమా గురించి మాట్లాడింది. "ఈ చిత్రాన్ని ఒప్పుకోవడానికి స్క్రిప్ట్ కూడా మరో కారణం. చిత్రబృందం నన్ను సంప్రదించిన సమయంలో నేను చాలా ఎమోషనల్ సినిమాల్లో నటిస్తున్నాను. అందుకే మనసుకు హాయిగా అనిపించే పాత్రలు చేయాలనుకున్నా. ఈ కథ విన్నప్పుడు నాకు 'బిఫోర్ సన్‌రైజ్' అనే హాలీవుడ్ సినిమా గుర్తొచ్చింది. ఆ చిత్రమంటే నాకు చాలా ఇష్టం. అందుకే ఈ ప్రాజెక్ట్‌కి ఒకే చెప్పా. ప్రీమియర్ షో చూసిన తర్వాత ఈ పాత్రకు నేను సరిపోలేదని నాకు అనిపించింది. దీని కోసం నన్ను కాకుండా మరొకరిని ఎంపిక చేసి ఉంటే బాగుండేదని ఆమిర్‌తో చెప్పా" అని చెప్పుకొచ్చింది సాయి పల్లవి. ఆకర్షించే పాత్రలతో అలరించే ఈ తార.. తొలి హిందీ చిత్రమిదే కావడం విశేషం.

## కార్తితో మీనాక్షి?

కథానాయకుడు కార్తి తెలుగులో కొత్త చిత్రానికి శ్రీకారం చుట్టారు. 'మ్యాడ్', 'మ్యాడ్ స్క్వేర్' విజయాలతో అందర్నీ మెప్పించిన కల్యాణ్ శంకర్ దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నారు. ఇది గురువారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైనట్లు తెలిసింది. కల్యాణ్ శైలికి తగ్గట్లుగా ఓ సరికొత్త వినోదాత్మక కథతోనే ఈ చిత్రం ముస్తాబు కానుందని సమాచారం. దీంట్లో మీనాక్షి చౌదరి కథానాయికగా కనిపించనున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే రెగ్యులర్ చిత్రీకరణ మొదలు కానుంది. దీన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మిస్తోంది. ఇక ప్రస్తుతం కార్తి నటించిన 'సర్దార్ 2' నిర్మాణానంతర పనుల్లో ఉండగా.. 'మార్షల్' శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోంది.



## సినిమా చూశాక 'లవ్ యూ నాన్న' అనాల్సిందే



'గోదారి గట్టుపైన' సినిమా చూసి బయటకొచ్చిన ప్రతి అమ్మాయి కచ్చితంగా వాళ్ల నాన్నకి ఫోన్ చేసి 'లవ్ యూ నాన్న' అని చెప్తారు. అలాంటి అందమైన భావోద్వేగాలు ఈ చిత్రంలో ఉన్నాయి'' అన్నారు హీరో సుమంత్ ప్రభాస్. ఆయన.. నిధి ప్రదీప్ జంటగా నటించిన ఈ సినిమాని సుభాష్ చంద్ర తెరకెక్కించారు. పప్పెట్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించింది. జగపతిబాబు, లైలా కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ రోజు థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుకని నిర్వహించారు. సుమంత్ ప్రభాస్ మాట్లాడుతూ.. "మనుషుల మధ్య ఉండే అందమైన అనుబంధాల్ని, భావోద్వేగాల్ని దర్శకుడు సుభాష్ ఈ సినిమాలో అద్భుతంగా చూపించారు. ఓ తండ్రి తన కూతుర్ని మిస్ అవుతున్న సందర్భం గురించి ఆలోచిస్తే కళ్లలో నీళ్లు తిరుగుతాయి'' అన్నారు. "మా బాబాయ్ నుంచి స్ఫూర్తి పొంది చేసిన చిత్రమిది. తనూ కూతుర్ని ఎక్కువగా ప్రేమించే తండ్రే. ఆ పాత్రనే దీంట్లో జగపతిబాబు పోషించారు'' అన్నారు దర్శకుడు

## భారీ కుంభకోణంలో బాబీడేల్

మెరిసే తారల మధ్య రాక్‌స్టార్‌గా మంచి జీవితాన్ని గడుపుతున్నాడు ఓ టీవీ స్టార్. కానీ ఆ మెరుపులు ఎన్నో రోజులు లేవు. కొందరు ఆయన్ని ఓ భారీ కుంభకోణంలో ఇరికించి.. జైలుకెళ్లేలా చేశారు. మరి ఆ తర్వాత ఏమైంది? అనేది తెలుసుకోవాలంటే 'బందర్' సినిమా చూడాల్సిందే. హీరో, ప్రతినాయక పాత్రలతో మెప్పిస్తున్న బాబీ డేఓల్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రమిది. అనురాగ్ కశ్యప్ దర్శకత్వం వహించారు. ఇప్పటికే పలు చిత్రోత్సవాల్లో ప్రదర్శితమై విమర్శకుల ప్రశంసలు అందుకున్న ఈ చిత్రం.. జూన్ 5న థియేటర్లలోకి రాబోతుంది. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఇన్‌స్టా వేదికగా టీజర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. మెరిసే జాకెట్, తళతళలాడే సన్ గ్లాసెస్ ధరించి.. గిటార్ పట్టుకున్న బాబీని స్టైలిష్‌గా చూపిస్తూ మొదలైన ఈ టీజర్ ఆద్యంతం ఆసక్తిగా సాగుతోంది. సన్యా మల్హోత్రా, సబా ఆజాద్, జితేంద్ర జోషి, రాజ్ బి.శెట్టి తదితరులు కీలక పాత్రలు పోషించారు. నిఖిల్ ద్వివేది నిర్మించారు.



# అడవిలో ప్రియాంక పోరు

'ది బ్లఫ్'లో ఇటీవలే సముద్రపు దొంగ పాత్రలో కనిపించి ప్రేక్షకుల్ని అదరగొట్టింది కథానాయిక ప్రియాంక చోప్రా. ఇప్పుడామె ఓ సర్వైవల్ థ్రిల్లర్‌తో అలరించడానికి సన్నద్ధమవుతోంది. ప్రియాంక, ఓర్లాండో బ్లూమ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'రీసెట్'. మాట్ స్మక్లర్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ హాలీవుడ్ చిత్రాన్ని అధికారికంగా ప్రకటిస్తూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్ట్ పెట్టింది ప్రియాంక. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ.. "ఆకర్షణ, అనుమానం రెండూ ఏకకాలంలో కనిపించే జంట కోసం నేను వెతికాను. ప్రియాంక, ఓర్లాండో ఈ పాత్రలకు వంద శాతం న్యాయం చేయగలరని నమ్ముతున్నాను. వారి మధ్య కెమిస్ట్రీ అద్భుతంగా ఉంటుంద"న్నారు. అడవిలో చిక్కుకున్న ఓ మహిళ చేసే పోరాటం చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని, ఆగస్టులో దీన్ని పట్టాలెక్కించడానికి సన్నాహాలు చేస్తున్నారని చిత్ర వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ప్రియాంక 'వారణాసి'తో బిజీగా ఉంది.

